క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ పంపిణీ



లింగాలఘణపురం: తాను చదువుకున్న పాఠశాలలోని విద్యార్థులకు సొంత ఖర్చులతో స్టడీ మెటీరియల్ ఇవ్వడం ఆనందంగా ఉందని, ఇలా ప్రతి ఒక్కరూ ప్రయోజకులు కావాలని దళితరత్న అవార్డు గ్రహీత మబ్బు పరశురాములు అన్నారు. మండలంలోని క్లాం ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు జై భీమ్ ఆధ్వర్యంలో ఆన్‌ఇన్‌వన్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పరశురాములు మాట్లాడారు. మహేశ్, శేఖర్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కన్నయ్య పాల్గొన్నారు.

కూనూర్‌లో..



జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థులకు దాత ముచ్చ భాస్కర్‌రెడ్డి స్టడీ మెటీరియల్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎస్‌సీ పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. ఇందుకోసం ఇప్పటి నుంచే విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎండీ పర్వేజ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి



శోభ(ఫైల్)

కొడకండ్ల: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన నట్టు యాకన్నతో 14 ఏళ్ల క్రితం శోభ(30)కు వివాహం కాగా మెడికల్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. భర్త మద్యానికి బానిసగా మారి తిరుగుతున్నాడని మనస్తాపం చెందింది. దీంతో శోభ ఈ నెల 6న డీజిల్ పోసుకుని నిప్పంటించుకోగా తీవ్రంగా గాయపడింది. కుటుంబీకులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి మారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలున్నారు.

వ్యక్తిపై కేసు

కొడకండ్ల: కడగుట్టతండాకు చెందిన ధరావత్ ఉపేందర్ అక్రమంగా క్వింటా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సోమవారం పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

చిల్పూరు: భూతగాదా విషయంలో మహిళపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ సోమవారం తెలిపారు. చిల్పూరుకు చెందిన మల్రిపెల్లి సరితకు ఎకరం భూమి ఉంది. చిన్నాన్న దామెర మల్లయ్య ఆ భూమి తనదేనంటూ గొడవకు దిగడంతో పాటు ఆమెపై దాడి చేశాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పాలకుర్తి టౌన్: విష్ణుపురం గ్రామ సమీపంలో సోమవారం అనంతరెడ్డి ఇంటి ఎదుట చెట్ల మధ్యలో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సైదూలం పవన్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ సోమిరెడ్డి, కానిస్టేబుల్ సంపత్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మేక, గొర్రె పిల్లల మృతి



బచ్చన్నపేట: లింగంపల్లి గ్రామ శివారు గ్రామమైన పుల్లగూడలో ఊర కుక్కల దాడిలో మేక, గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భిక్షపతి జీవాలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే గొర్రె పిల్లలను పాకలో వేసి, జీవాలను మేతకు తోలుకెళ్లాడు. సాయంత్రం వచ్చేసరికి పాకలోని 20 పిల్లలపై ఊర కుక్కలు దాడి చేసి చంపివేశాయి. ఈ దాడిలో రూ. లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. సంబంధిత అధికారులు ఊర కుక్కల బెడదను నివారించి బాధితుడిని ఆదుకోవాలని పలువురు కోరారు.

నాసిరకంగా సీసీ రోడ్ల నిర్మాణం

- బాణాపురంలో అడ్డగోలు నిర్మాణాలు
- తూతూ మంత్రంగా క్యూరింగ్
- జాడలేని అధికారుల పర్యవేక్షణ



సీసీపై కనిపిస్తున్న సన్నని కంకర



కాలనీలో సగం వరకు వేసి వదిలేసిన సీసీ

జనగామ: జనగామ మున్సిపల్ పరిధిలో నాసిరకంగా సీసీ రోడ్ల నిర్మాణ పనుల పరంపర కొనసాగుతోంది. పట్టణమంతా నిట్టనిలువునా సీసీరోడ్లు పగిలి పోతున్నా... కొత్త నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించడం లేదు. పట్టణంలోని బాణాపురం కాలనీలో స్పెషల్ డెవలప్‌మెంట్ (ఎస్‌డీఎఫ్) నిధులు రూ.20లక్షలతో నాలుగు చోట్ల సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. సీసీరోడ్డు నిర్మాణ సమయంలో నిబంధనలు పాటించలేదని కాలనీవాసులు ధ్వజమెత్తుతున్నారు. నేలను తవ్వకుండా డ్రెయినేజీకి ఎత్తుగా.. ఇంటి గుమ్మం మునిగే విధంగా సీసీ నిర్మాణ పనులు చేశారంటూ మండిపడుతున్నారు. సీసీ నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాసిరకంగా ఉన్నాయంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సీసీ నిర్మాణం చేసినప్పటి నుంచి నేటివరకు తూతూ మంత్రంగా వాటర్ క్యూరింగ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సీసీపై కనిపిస్తున్న కంకరతో మూన్నాళ్ల ముచ్చటే అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు మట్టిరోడ్డుతో నరకం చూస్తే... సీసీ రోడ్డుపై గుంతలు పడితే మళ్లీ కష్టాలు తప్పవంటూ ఆవేదన చెందుతున్నారు. పలు వార్డుల్లో సగం వరకే రోడ్డు నిర్మాణం చేసి ఆపేయడంతో అధికారుల తీరును తప్పుబడుతున్నారు. ఏఈ మహిపాల్ మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించే విధంగా పర్యవేక్షించామని, వాటర్ క్యూరింగ్ చేస్తున్నామన్నారు.

సీసీలో నాణ్యత లేదు..



సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత లేదు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే బిల్లులు మంజూరు చేయాలి. రోడ్డు వేసిన 10 రోజుల తర్వాత వాటర్ క్యూరింగ్ చేశారు. సీసీ వేసే సమయంలో నేలను తవ్వ కుండా ఎత్తుగా వేయడంతో ఇంటి గుమ్మం మునిగి పోయే పరిస్థితి.

- ఎండీ.ఫజల్, బాణాపురం

సగం వరకే రోడ్డు వేసి వదిలేశారు..



వార్డులో సీసీ సగం వరకే వేసి వదిలేశారు. అధికారులను పూర్తిగా వేయాలని అడిగితే బడ్జెట్ లేదని చెబుతున్నారు. దీంతో ఇబ్బందులు తప్పేలా లేదు. వాటర క్యూరింగ్ చేసిన దాఖలాలు లేవు.

- కాముని అశోక్, బాణాపురం

ఇష్టారాజ్యంగా నిర్మించారు



సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించ లేదు. ఇష్టారాజ్యంగా వేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోవడం లేదు. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన సీసీ రోడ్లపై కనీసం వాటర్‌క్యూరింగ్ సరిగా లేదు. దీంతో అధికారుల దృష్టికి తీసుకు వెళ్తే ఒక్కరోజు క్యూరింగ్ చేశారు. కలెక్టర్ ఈ పనులను తనిఖీ చేసి, నాణ్యత ఉంటేనే బిల్లులు మంజూరు చేయాలి.

- సముద్రాల సందీప్, బాణాపురం

మిల్లులకు ధాన్యం తరలించాలి



పాలకుర్తి టౌన్: కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రోహిత్‌సింగ్



ట్రక్ షీట్లను పరిశీలిస్తున్న ప్రకాశ్‌రావు

పాలకుర్తి టౌన్: కొనుగోలు కేంద్రాంలో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ బి.రోహిత్‌సింగ్ నిర్వాహకులను ఆదేశించారు. పాలకుర్తి సొసైటీ, ఐకేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో, పెద్దతండా(బి), బమ్మెర అయ్యంగారి పల్లి, మంచుప్పుల, తీగారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి ధాన్యం తేమ, రికార్డులను పరిశీలించారు. సొసైటీ చైర్మన్ బొబ్బల అశోక్ రెడ్డి, తహసీల్దార్ పి శ్రీనివాస్, ఏపీఎం పిట్టల నరేందర్, ఆర్‌ఐ రాకేష్, సీసీ కె.వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం దిగుమతి చేసుకోవాలి

బచ్చన్నపేట: కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం బస్తాలను రైస్ మిల్లర్లు వెంటనే దిగుమతి చేసుకోవాలని తహసీల్దార్ ప్రకాశ్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని పలు రైస్ మిల్లులకు వెళ్లి యజమానులతో మాట్లాడారు. కార్యక్రమంలో మిల్లు యజమానులు, పలువురు పాల్గొన్నారు.

'వర్గీకరణ అమలులో విఫలం'

చిల్పూరు: ఎస్సీ వర్గీకరణ అమలులో సీఎం విఫలమయ్యాడని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ అన్నారు. మండల కేంద్రంలోని శేషాద్రి నిలయంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల సమావేశం ఎంఎస్‌పీ జిల్లా సీనియర్ నాయకుడు నలిమెల నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి హర్యాణా, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తుంటే తెలంగాణ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. చుంచు రాజు, గద్దల కిషోర్, పైసా రాజశేఖర్, శ్రీనివాస్, నగేష్, రవీందర్, సుధాకర్, సోమరాజు, మహేష్, అరుణ్ పాల్గొన్నారు.

సమాజ హితానికి సేవా కార్యక్రమాలు



దేవరుప్పుల: ఎన్పీడీసీఎల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి నెల సమాజ హితం కోసం సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆ శాఖ జనగామ ఎస్‌ఈ సీ.వేణు మాధవ్ తెలిపారు. సోమవారం మండలంలోని సీతారాంపురం అనాథ వృద్ధ శరణాలయానికి ఎన్పీడీసీఎల్ సీఎండీ సూచనలతో సర్కిల్ ఉద్యోగుల సౌజన్యంతో రూ.20 వేలను అందజేశారు. కార్యక్రమంలో టెక్నికల్ డీఈ గణేష్, ఆపరేషన్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఎడిఇ అనిల్‌కుమార్, ఏఇ నర్సింహ్మారెడ్డి, శరణాలయ నిర్వహకులు బ్రహ్మచారీ, విద్యుత్ సిబ్బంది నర్సయ్య, ప్రసాద్, నాగేశ్వర్ పాల్గొన్నారు.

బారికేడ్లతో రోడ్డు ప్రమాదాల నివారణ



బారికేడ్లను పరిశీలిస్తున్న ఏసీపీ, సీఐ

జనగామ: బారికేడ్లతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఏసీపీ పార్థసారథి అన్నారు. వరంగల్ సీపీ, డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆదేశాల మేరకు సోమవారం ఏసీపీ పార్థసారథి ఆధ్వర్యంలో సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై చెన్నకేశవులు హైవేపై పర్యటించారు. పెంబర్తి నుంచి యశ్వంతాపూర్ నేషనల్ హైవేపై బ్లాక్ స్పాట్స్ (ప్రమాదాలకు గురవుతున్న ప్రదేశాలు) సందర్శించారు. వాహనాల వేగం తగ్గించి, ప్రమాదాలు జరగకుండా రోడ్డు మధ్యలో బారికేడ్లను ఏర్పాటు చేసి రాత్రి సమయంలో వాటిని గుర్తు పట్టేలా రేడియం స్టిక్కర్లను అంటించారు. వాహన చోదకులు రోడ్డుపై వెళ్లే సమయంలో స్టాపర్ బోర్డులను గమనించాలని ఏసీపీ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

స్టేషన్‌ఘన్‌పూర్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని డివిజన్ కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఘన్‌పూర్ రామలింగేశ్వరస్వామి దేవాలయం, శివునిపల్లి నగరేశ్వరాలయంతో పాటు పలు గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు పరమశివుడికి పూజలు చేశారు.

సిద్దేశ్వరాలయంలో..

బచ్చన్నపేట: కొడవటూర్ గ్రామంలోని స్వయంభూ సిద్దేశ్వరాలయంలో కార్తీక మాస రెండో సోమవారం పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అభిషేకాలు, అన్నపూజ కార్యక్రమాలను చేపట్టారు. ఆలయం ఎదుట దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయ, ఈఓ చిందం వంశీ, సిబ్బంది నూకల లక్ష్మీకాంత్‌రెడ్డి, బండారి శ్రీనివాస్, గంగం భానుప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్నధాన్యానికి బోనస్ ఇవ్వాలి

కొడకండ్ల: రైతులు రైస్ మిల్లులో విక్రయించిన సన్నధాన్యానికి కూడా ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వాలని మార్కెట్ మాజీ చైర్మన్ పేరం రాము డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వానాకాలం సీజన్‌లో క్వింటా సన్నధాన్యానికి రూ.2,600 నుంచి 2,700 ధర లభిస్తే ఈ సీజన్‌లో రూ.2,200కే పరిమితమైందని, రైతుభరోసా ఇవ్వని ప్రభుత్వం బోనస్ వర్తింపజేయకపోతే రైతులు తీవ్ర అన్యాయానికి గురవుతారని అన్నారు. పెట్టుబడి వ్యయం మూడింతలు పెరిగినందున రైతులకు ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర ఏమాత్రం సరిపోవడం లేదని, బోనస్ ఇచ్చి ఆదుకొవాలని అయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా సురేశ్

లింగాలఘణపురం: మండలంలోని సిరిపురానికి చెందిన గండి సురేశ్‌ను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా నియమించినట్లు ఎంఎస్‌పీ జాతీయ నాయకులు మంద కుమార్, సూరన్న, దయాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా నల్ల ఉపేందర్, గండి కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా కొంపల్లి నాగార్జున, కార్యదర్శులుగా బాబు, కనకరాజు, ప్రభాకర్, నవీన్‌లతో పాటు పూర్తి కమిటీని ప్రకటించారు.


సీపీఎం మండల కార్యదర్శిగా రాజు

జఫర్‌గఢ్: తమ్మడపల్లి (జి) గ్రామానికి చెందిన గుండెబోయిన రాజు సీపీఎం మండల కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన పార్టీ 8వ మండల మహాసభలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా గుండెబోయిన రాజు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా కమిటీ సభ్యులుగా కాట సుధాకర్, నల్లతీగల శ్రీనివాస్, ఎస్‌కే ఎక్బాల్, వడ్లకొండ సుధాకర్, ముక్కెర గంగరాజు, నర్సింగోజు రాజు, యాతం సమ్మయ్య, ఎంపెల్లి అజయ్, ఎండీ షబానా, రాపర్తి రజిత ఎన్నికైన వారిలో ఉన్నారు.

ఎన్నిక

పాలకుర్తి: టీపీఎఫ్ జిల్లా నూతన కౌన్సిల్ సమావేశం పాలకుర్తిలోని ఉమాపతి భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇమ్మడి అశోక్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎస్. శేషగిరిరావు ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. కుటుంబ సర్వేకు ఉపాధ్యాయులు వెళ్లిన సమయంలో ప్రజలు వ్యవసాయ పనులకు వెళ్తున్నందున ఉదయం వేళల్లో సర్వే కొనసాగించాలన్నారు.

నివాళి



జనగామ రూరల్: సీపీఐ నాయకుడు, జనగామ జాక్ కన్వీనర్ మంగళంపల్లి రాజు తండ్రి జనార్దన్ ఇటీవల మృతిచెందాడు. కాగా, సోమవారం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా కేంద్రంలో జనార్దన్ చిత్రపటానికి పూమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పంచాయతీ కార్మికుడికి..

రఘునాథపల్లి: వెల్ది గ్రామ పంచాయతీ కార్మికుడు కొయ్యడ అబ్బసాయిలు (60) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. నాలుగు దశాబ్దాలుగా గ్రామానికి సేవలందించిన అబ్బసాయిలు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మాల కులస్తులు ఆర్థికసాయం అందజేశారు. భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

బాలికలు చదివితే సమాజానికి వెలుగు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి



జనగామ రూరల్: మాట్లాడుతున్న జమున

స్టేషన్‌ఘన్‌పూర్: బాలికలు చదివితే సమాజం అభివృద్ధి చెందుతుందని, ఆడపిల్లలకు అవకాశం ఇస్తే ఆకాశమే హద్దుగా రాణిస్తారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని నమిలిగొండ శివారు ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో.. మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా సోమవారం మైనార్టీ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాధవీలత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీ విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవతో పనిచేస్తుందని, ఒక్కొక్క విద్యార్థిపై ఏడాదికి రూ.1.25 లక్షలు వెచ్చిస్తుందన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థినులచే నిర్వహించిన నృత్యాలు ఆహుతులను అలరించాయి. మార్కెట్ చైర్మన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ రజాక్‌యాదవ్, పాఠశాల ఉపాధ్యాయినిలు, విద్యార్థినులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

అబుల్ కలామ్ సేవలు చిరస్మరణీయం

జనగామ రూరల్: కేంద్ర ప్రథమ విద్యాశాఖ మంత్రి అబుల్ కలామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని జనగామ మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున అన్నారు. జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల(బాలుర)లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జమున మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. అనిల్ బాబు అధ్యక్షత వహించగా మున్సిపల్ కౌన్సిలర్ సమద్, కోఆప్షన్ మెంబర్ మసీఉర్ రెహ్మాన్ , జిల్లా కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు జఫర్ షరీఫ్, అజీమ్ కళాశాల కోఆర్డినేటర్ వీరస్వామి అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోమల్ల పీహెచ్‌సీకి డాక్టరొచ్చిండు..



వైద్యాధికారిని సత్కరిస్తున్న స్థానికులు

రఘునాథపల్లి: మండలంలోని కోమల్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులు బదిలీపై వెళ్లడంతో సరైన వైద్యం అందించే డాక్టర్ కరువయ్యాడు. ఆదివారం గ్రామంలో సమగ్ర సర్వేను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ రిజ్వాన్‌బాషాతో స్థానిక ఆసుపత్రిలో రెగ్యూలర్ డాక్టర్ లేదని విన్నవించారు. కలెక్టర్ వెంటనే డీఎంహెచ్‌ఓకు ఫోన్ చేసి కోమల్ల పీహెచ్‌సీకి రెగ్యులర్ డాక్టర్‌ను వేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఆస్పత్రికి రెగ్యులర్ డాక్టర్‌గా ఇంజమం భాధ్యతలు చేపట్టారు. తమ విజ్ఞప్తికి వెంటనే స్పందించి ఆస్పత్రికి వైద్యాధికారిని నియమించడం పట్ల గ్రామస్తులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రిలో బాధ్యతలు చేపట్టిన వైద్యాధికారిని స్థానికులు శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాటికొండ వెంకటేష్‌యాదవ్, మేకల అంజయ్, బొల్లపల్లి కుమారస్వామి, తాళ్లపల్లి కోమలత తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌ను సందర్శించిన గురుకుల విద్యార్థులు



ఇన్ఫోసిస్ టీంతో విద్యార్థినులు

కొడకండ్ల: మండలకేంద్రంలోని టీజీఆర్ఎస్ జేసీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఎడ్యుకేషనల్ టూర్‌లో భాగంగా సోమవారం గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ క్యాంపస్‌ను సందర్శించారు. గ్రామీణ ప్రాంతంలో చదువుకున్నప్పటికీ కార్పొరేట్ లైఫ్‌ని అందుకోవడం కష్టమేమి కాదనే విశ్వాసాన్ని ప్రేరణను విద్యార్థినుల్లో నింపేందు కోసం ఇన్ఫోసిస్ టూర్‌కు తీసుకెళ్లినట్లు ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్ తెలిపారు. కాగా, ఇన్ఫోసిస్ సిబ్బంది అన్ని విషయాలపై సమగ్రంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంచి గైడెన్స్‌తో విద్యార్థినుల్లో నూతనోత్తేజాన్ని రేకెత్తించి భవిష్యత్ కోసం అనుసరించాల్సిన ఫార్ములాలను వివరించారు. కాగా, మమత టీం, రాపాక నాగరాజు, స్వాతిలకు ప్రిన్సిపాల్, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

జఫర్‌గఢ్: రాష్ట్రంలో పేరుకుపోయిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పార్టీ మండల నూతన కమిటీ సమావేశాన్ని కాట సుధాకర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అనంతరం సోమయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, నాయకులు నల్లతీగల శ్రీనివాస్, యాతం సమ్మయ్య, ఎస్‌కే ఎక్బాల్, అజయ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుటుంబ సమగ్ర సర్వే



రఘునాథపల్లి: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు



చిల్పూరు: వివరాలను తెలుసుకుంటున్న మాధవీలత

పాలకుర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. మండలంలోని అయ్యంగారిపల్లిలో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేలో కుటంబంలోని పూర్తి వివరాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ రాకేశ్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలంతా సర్వేకు సహకరించాలి

రఘునాథపల్లి: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండలంలోని ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, లక్ష్మీతండా, మాధారంలో ఆయన సర్వేను పరిశీలించారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: సర్వేలో భాగంగా మూడో రోజు సోమవారం ఎన్యుమరేటర్లు ఆయా గ్రామాల్లోని ఇళ్లలో కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. కాగా పలు గ్రామాల్లో జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీఓ మల్లికార్జున్‌లు సర్వేను పరిశీలించారు.

పల్లగుట్టలో..

చిల్పూరు: పల్లగుట్ట గ్రామంలో నిర్వహించిన ఇంటింటి సమగ్ర సర్వేను ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి మాధవీలత పరిశీలించారు. ఈ సందర్భంగా కుటుంబ వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి బాబునాయక్, వెంకట్రాజం, జీడి ఆనందం పాల్గొన్నారు.

సన్మానం

లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన గవ్వల శ్రీనివాసు-మంగల కూతురు అనూష మెడిసిన్ సీటు సాధించడం పట్ల తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. పేద కుటుంబంలో జన్మించిన అనూష పట్టుదలతో మెడిసిన్‌లో సీటు సాధించడం అభినందనీయమని రజక రిజర్వేషన్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు వీరయ్య అన్నారు. జిల్లా అధ్యక్షుడు నరేశ్, మల్లేశం, లింగరాజు, నర్సయ్య, అంజయ్య, సోమనర్సయ్య, ఆజనేయులు పాల్గొన్నారు.

గ్యారంటీలు అమలు చేయాలి

లింగాలఘణపురం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారటీలను అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి సదానందం డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కుందారంలో సీపీఐ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల గణనలో ఆధార్ నంబర్లు, ప్రజల బ్యాంక్ ఖాతాలు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కే ప్రమాదం ఉందని, ప్రభుత్వం ఆలోచించాలని అన్నారు. జక్కుల రాములు, సిద్దు, గణేష్, యాదగిరి, యాకయ్య, నర్సయ్య, మల్లయ్య, ఎల్లేశ్, ఉప్పలయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని రంగరాయగూడెం గ్రామంలో నేడు(మంగళవారం) నిర్వహించనున్న సీపీఎం మండల మహాసభకు నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి మునిగెల రమేశ్ పిలుపునిచ్చారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో సోమవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం లేని సమాజం కోసం దేశవ్యాప్తంగా సీపీఎం బూర్జువా పార్టీలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరిస్తూ దగా చేస్తుందని, ప్రజలకు చేసిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. నేడు ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్ హాజరవుతారని ఆయన తెలిపారు. పార్టీ నాయకులు కొడెపాక యాకయ్య, గుర్రం వెంకటనర్సు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో
మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జనగామ :
9951602871
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (S.R) : 9885438059 (జనగామ)
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)